


# ఆమెతో ఒక రోజు

## విజయలక్ష్మి

## (యువ, 1962 సెప్టెంబర్ సంచిక నుంచి)




అఖిల బల్లమీద ఫైళ్ళన్నీ పరుచుకుని ఏదో కాయితం కోసం వెతుకుతోంది. కామేశ్వరి గదిలోకి వస్తూనే "అనుకుంటూనే వున్నా, దేనినో వెతుక్కుంటూ వుంటావని, ఏం పోయింది?" అనడిగింది.

అఖిల కామేశ్వరిని చూసి నవ్వుతూ "ఏదీ ఎక్కడకీ పోదు కామూ, రోజూ ఏదో ఒకటి కాసేపు కనిపించకుండా నన్ను తిప్పలు పెడుతూ వుంటుంది" అంది.

"పోదూ, ఎట్లయినా నీకు అశ్రద్ధ జాస్తి. మరి నీ బల్లమీద ఫైళ్ళు తక్కువగా వున్నాయేమోనని నేను ఒకటి పట్టుకొచ్చాను" అంది కామేశ్వరి.

"ఔను అఖిలా, ఆ స్టాటిస్టీషియన్ సెలవులో వున్నాడుట. పెళ్ళయిన ఆరునెల్ల నంచి నాలుగు నెలలు సెలవమీద వున్నాడనుకో మానవుడు ! నా data కొండలాగ పెరిగిపోయింది. నువ్వు కాస్త 'ఎనలయిజ్' చేసి పెడుదూ!" అంది కామేశ్వరి.

అంత పెద్ద ఫైలు చూసి కాస్త సందేహిస్తూ "నేను త్వరగా పూర్తి చెయ్యలేనేమో కామూ. నా Annual Report వ్రాయడం పూర్తి కాలేదు. పైగా యివాళనుంచి ఓ క్రొత్త స్టూడెంటు వచ్చాడు ఎం.ఎస్.సి.కి." అంది అఖిల.

"అదేం కుదరదు బాబూ, చచ్చిపోతాను నువ్వు కనుక యీపని చేసి పెట్టకపోతే. అదికానిదే నా పని ముందుకు నడవదసలు" అంది కామేశ్వరి.

"సరే చూస్తాలే, కంగారు పడకు. కాస్త టైమ్ మాత్రం పడుతుంది" అంది అఖిల ఫైలు తీసుకుంటూ.

"ఎవరా స్టూడెంటు? ఇప్పుడు లైబ్రరీలో చూసాను. సన్నగా పొడుగ్గా అతడేనా" అంది కామేశ్వరి.

"ఆ, అతడే, బి.యస్.సి. ఫస్టు క్లాసట. తెలివైన వాడిలా వున్నాడు. పద్దెనిమిదేళ్ళు కూడా వుండవేమో కదూ ! నన్ను చూసి నిన్న ఒణికిపోయాడనుకో, వూరికే బెదురు చూపులు అమ్మాయిలాగ! నాకు ఒక తమ్ముడుండేవాడని చెప్పాను కదూ కామూ !"

"ఔను టైఫాయిడ్ వచ్చి..."

"ఆఁ వాడే. నిన్న యీ అబ్బాయి వచ్చిందగ్గరనించి వాడే గుర్తుకు వస్తున్నాడు. నిన్నయితే మరీ పాడయింది మనసు. వాడు వుంటే. యిప్పటికి యిట్లాగే బి.యస్.సి. పాసయి వుండేవాడు."

"అతనికేం ప్రాబ్లెమ్ యిచ్చావు" అంది కామేశ్వరి సంభాషణ తప్పిస్తూ.

"ఇంకా ఏమీ ఆలోచించలా. అతని యింటరెస్ట్ ఏమిటో కనుక్కోవాలిగా !"

"కాదనకుండా చేస్తావు కదాని అరవచాకిరీ యిస్తాడోయ్ ప్రొఫెసర్ నీకు" అంది కామేశ్వరి, తాను అఖిల దగ్గరకు ఎందుకు వచ్చిందో మర్చిపోయి.

"చాకిరీ ఏముందిలే కామూ, నా మీద అంత నమ్మకం, గురి ఏర్పడ్డాయి ఆయనకు. అది చాలదూ" అంది అఖిల. ఇంతలో ఓ కుర్రాడు గదిలోకి వచ్చి "మీకు ఫోను వచ్చిందండీ" అన్నాడు అఖిలతో. అఖిల లేచింది. "అయితే నే వెళ్తా"నంటూ లేచింది కామేశ్వరి.

అఖిలకు ఫోను చేసింది లేడీస్ క్లబ్ సెక్రటరీ శాంతాదేవి. "క్లబ్ డే పదో తేదీన మేచెస్ రేపు సోమవారం నుంచి మొదలు. బాడ్మెంటన్ కు. టెబిల్ టెన్నిస్ కు నీ పేరిచ్చాను" అంది శాంత.

"అయ్యో, ఆఫీసులో పని ఎక్కువగా వుంటోంది శాంతా. మేచెస్ కు సరిగ్గా రావడానికి నాకు వీలవదేమో, నా పేరు యివ్వొద్దు" అంది అఖిల.

"హేట్. అదంతా పనికి రాదు. పేరివ్వడం అయింది. లాట్స్ తియ్యడం కూడా అయింది. టేబిల్ టెన్నిస్ సింగిల్స్ లో నీకు, నీరజాక్షికీ పడింది. డబుల్స్ లో నేనూ నువ్వూ ఒక పక్క, అవతల పక్క సుమిత్రా, రాధాను. టైమింగ్స్ అంతా వివరంగా వ్రాసి పంపుతాను, సరిగ్గా రావాలి సుమా" అంది శాంత.

"సరే, ఇహ ఎట్లా తప్పుతుంది" అని నవ్వింది అఖిల.

మధ్యాహ్నం పన్నెండయ్యాక భోంచెయ్యడానికి వెళ్ళింది అఖిల. ప్లేటులో వడ్డించుకుని నాలుగుముద్దలు తిన్నదో లేదో, అన్నంలో అరంగుళం పొడుగు ప్రాణి కనిపించింది. చేతిలో ముద్ద ప్లేటులో విడిచి లేచి వెళ్ళింది. ఏడుపు వచ్చిందామెకు. కడుపులో ఆకలి అణగలేదు. "యీ హోటలు భోజనంతోనే నేను చచ్చిపోతాను" అనుకుంది. ఇల్లు విడిచి వచ్చిన క్రొత్తలో, అన్నం తినీ తినక మంచాన పడినంత పనైంది ఆమెకు. క్లబ్ స్నేహితురాలు మాలతి వాళ్ళింటికి వచ్చి వుండమని ఎంతో చెప్పింది. "వుండటానికి కూడా ఎంతో సౌకర్యం అఖిలా. మా అక్కలు నలుగురూ పెళ్ళయి వెళ్ళిపోయాక యిల్లంతా ఖాళీగానే వుంటుంది. అన్నయ్య, వదిన పైన వుంటారు. కింద నేనూ, అమ్మా వుంటాం. అన్ని గదులూ ఖాళీగానే వున్నయ్. వచ్చి వుండు" అన్నది మాలతి.

అఖిల నవ్వి "బాగుంది, నిన్ను నమ్మివస్తే, నువ్వూ మీ అక్కయ్యల్లాగే వెళ్ళిపోతే నేనేం కావాలి?" అంది.

మాలతి కూడా నవ్వి "ఆ బెంగ నీకు వద్దులే, మా అమ్మకు నేనంటే ఎంత ఇష్టం, ఎంత ముద్దూ అంటే, ఛస్తే, ఓ పట్టాన నాకు పెళ్ళి కానివ్వదు" అంది.

"ఛీ .. ఏం మాటలవి !"

"ఎందుకు రావు అఖిలా ? మా యింట్లో వుండటానికి అభిమానంగా వుంటుందా నీకు ! ఆ పక్షాన పేయింగ్ గెస్టుగా వుండు పోనీ ! మా అమ్మ ఒప్పుకోదు కానీ, ఒప్పించే భారం నాది. ఎట్లాగయినా నువ్వు కాస్త బావుండటమే నాకు కావలసింది. ఇట్లా చీటికీ మాటికీ జబ్బు పడుతుండటం మంచిది కాదు" అంది మాలతి.

మాలతి మనశ్శుద్ధికి, సహృదయతకు కళ్ళు చెమ్మగిల్లాయి అఖిలకు. కాని మాలతి కోరిక తీర్చలేక పోయింది. మాలతి అన్నయ్య ఒక శకారుడు. ఆ సంగతి మాలతికి తెలీదు. ఆ సంగతి తెలిసీ, ఆ యింటికి వెళ్ళి వుండే సాహసం అఖిలకు లేకపోయింది. గది అద్దెకు తీసుకుని, హోటలు భోజనంతో గడుపుతోంది అఖిల. ఆమెకు తల్లిదండ్రీ పోయి చాలా ఏళ్ళయింది. అన్న వదినెల అజమాయిషీలోనే పెరిగింది. వుద్యోగానికంటూ వెయ్యి మైళ్ళ దూరానికి వచ్చింది. ఇంటి దగ్గరుండగా, కాలేజీ నుంచి రావడం ఒక అరగంట లేటయితే "రేపటి నుంచి కాలేజీకి వెళ్ళఖ్ఖర్లా. చదువు మానేయ్" అని గర్జించే అన్నయ్య యిప్పుడు "ఆపీసులో పని ఎట్లా వుంది ? పొరుగు వాళ్ళు మంచి వాళ్ళేనా, భయమేమీ లేదుకద !" అని మాట వరసకైనా అడగలేదు. వూరు విడచి వచ్చేటప్పుడు, వెంట వుండేందుకు తనతో రావడానికి అఖిలకు, అమ్మమ్మా నాయనమ్మా కూడా లేరు. కొడుకు యింట్లోంచి తరిమిన ఒక వయసు చెల్లిన ఆమెను చేరదీసి యింట్లో వుంచుకుంది కొన్నాళ్ళు. నెల్లాళ్ళన్నా కాకముందే ఒకనాడు ఆ మనిషి మాయమయ్యింది. తరవాత చూసుకుంటే తను స్నానం చెయ్యడానికి వెళ్తూ తీసిపెట్టిన గొలుసూ, గాజులూ కనబడలేదు.

అఖిల కుఱ్ఱాణ్ణి పిలిచి టీ తెప్పించుకు త్రాగి, లైబ్రరీకి వెళ్ళి కాసేపు కొత్త జర్నల్స్ చూస్తూ వుండిపోయింది. లేబరేటరీకి రాగానే, కల్పకం పలుకరిస్తూ, "ఎక్కడికెళ్ళావు అఖిలా, మీ స్నేహితుడు రంగాచారి వచ్చి వెళ్ళాడు కాసేపటి క్రితం. నువ్వు ఎక్కడుందీ తెలియలేదు, గదిలో లేవట !" అంది.

"అరే, రంగాచారి వచ్చి వెళ్ళాడా! నేను లైబ్రరీలో వున్నాను. ఊ! ఏం చెప్పాడు కబుర్లు ?"

"వాళ్ళ చెల్లెల్ని యిక్కడ వుమన్స్ కాలేజీలో లెక్చరర్ పోస్టుకు ఇంటర్వ్యూకు పిలిచారట. వెంటబెట్టుకు వచ్చాడు. నిన్ను కలుసుకోడానికి వచ్చాడు. నువ్వెక్కడా కనపడలేదు. కాసేపుండి 'పనివుందని' వెళ్ళి పోయాడు." అంది కల్పకం.

రంగాచారి, అఖిల కాలేజీలో క్లాసుమేట్సు. ఆ రోజుల్లో అఖిలకు తెగ వుత్తరాలు వ్రాసేవాడు; ఒకటి రెండు వుత్తరాలు అఖిల అన్నయ్య చేతిలో పడగా, ఆ మనిషి చెల్లెలిమీద అరచిన అరుపులకు అంతులేదు. ఓ రోజు కచ్చి పట్టలేక "ఏ రోగమైనా వచ్చి వాడైనా చావాలి, నేనైనా చావాలి" అని మనసారా కోరుకుంది అఖిల. ఇప్పుడు తలచుకుంటే నవ్వు వస్తుందామెకు. రంగా చారి ఊటీ దగ్గర క్లైన్ మార్గెన్ లో ఇంజనీరుగా వుంటున్నాడు. ఆ వూరు వచ్చినప్పుడల్లా అఖిలను చూడకుండా వెళ్ళడు.

"అతను వచ్చేటప్పటికి మహంతి మీనన్, నేనూ వున్నాం లాబ్ లో. అబ్బ ఏం కబుర్లు చెప్తాడోయ్ మీ ఫ్రెండు ! దీపావళి సెలవల్లో వాళ్ళ వూరు రమ్మని మా అందరికీ ఓ పెద్ద ఆహ్వానం యిచ్చి వెళ్ళాడు. క్లైన్ మార్గెన్ నుంచి సింగారా వరకు రోప్ వే మీదుగా తీసికెళ్ళి అక్కడ పైకారా ఎలక్ట్రిక్ వర్క్స్ చూపిస్తానన్నాడు. "తాడు మీద ట్రక్కుల్లో కూర్చుని కొండ ఎక్కటం, దిగటం, ఎంత వింతగా వుంటుందనుకున్నారు" అన్నాడు. మొదటిసారి అతని భార్య ట్రక్కులో కూర్చుని, అది క్రిందకు జారడం మొదలు పెట్టగానే ఒకే కేకలూ, బొబ్బలూ నట. "కల్పకం గారూ, మీరు ఆమెలాగ మాత్రం అరవకూడదు సుమండీ" అన్నాడు. ఇట్లాగే ఏవో కబుర్లు ! నవ్వలేక చచ్చాం మేము. ఎట్లాగయినా మీ రంగాచారి "రిటాలిన్" లాంటి మనిషోయి!" అంది కల్పకం.

సాయంత్రం నాలుగయ్యేప్పటికి పని ముగించుకుని బస్సు స్టాపుకు నడిచింది అఖిల. ఇంటికి వెళ్ళి కాస్త టీ పెట్టుకు త్రాగి పడక్కుర్చీలో ఒరిగి పత్రికలు తిరగేస్తోంది. క్లబ్బునుంచి ఆవాళే వచ్చాయి నాలుగు పత్రికలు. ఏదో పత్రిక చూస్తూ నవ్వుకుంది. "రాజాజీ పుణ్యమా అని రామాయణం, భారతం ఇంగ్లీషులో చదువుకున్నాం. బాగానే వుంది. ఆఖరికి మదనకామరాజు కథలు కూడా ఇంగ్లీషులోనే చదువుకునే రోజులొచ్చాయి" అనుకుంది. ఏమీ తోచలేదామెకు. సినిమాకు వెళ్దామా అనుకుంది. 'రైన్ బో' లో 'మిరకిల్' వుంది. తక్కినవేమీ మంచివి లేవు. ఆ కథలో, ఆ అమ్మాయి మనసు పెట్టిన మగవాడికల్లా ఏదో ఆపద వచ్చేదట ! "దాని బ్రతుకులానే వుంది నా బ్రతుకు"! అనుకుంది అఖిల. కళ్ళు నిండుకు వచ్చాయి. బిగపట్టుకుంది. రేడియో త్రిప్పింది.

"అన్ మిలో.. ప్రీతమ్ అన్ మిలో" పాత పాట. గీతా గొంతు. హృదయం విలవిలలాడింది. పాట వింటూ బుగ్గలన్నీ తడుపుకుంది. పాట పూర్తయింది. రేడియో మీదనే ఒరిగిపోయి, "భగవంతుడా, నేనేం పాపం చేశానని, ఇంత అన్యాయం చేశావు నన్ను" అనుకుంది. పెట్టె తెరచి చీరల అడుగున పెట్టుకున్న కవరు బైటకు తీసింది. సిల్కు రుమాలలో చుట్టి వుంచిన ఫోటో తీసి ముఖానికి ఆనించుకుంది. అదెవరి ఫోటోనో ఆమెకే తెలియాలి. ఫోటో వంక చూస్తూ, "ఆశపడ్డాను, ఎదురు చూచాను. నిరీక్షణలో అందమూ ఆనందమూ వుంటాయంటారు. ఆ ఆనందం కూడా నువ్వు నాకు దక్కనివ్వలేదు" అంది. ఆ కథ గురించి వివరాలు ఎవరికీ తెలియవు. ఓ ప్రఖ్యాత ఉర్దూ కవి అంటాడు. "నాలుగు రోజుల జీవితాన్ని అడిగి తెచ్చుకున్నాను. రెండు రోజులు కోరికలు పెంచుకోవడం లోనూ, రెండు రోజులు ఎదురు చూడ్డంలోనూ గడిచిపోయాయి" అని. అఖిల సంగతీ అంతే అయింది.

పగలంతా నల్గురి మధ్య నవ్వుతూ తిరిగే అఖిల రాత్రయ్యేసరికి ఒంటరితనాన్ని ఆలోచనతో హెచ్చవేస్తూ వుంటుంది. ఒక్కసారి తన మీద తనే కోపం తెచ్చుకుంటుంది. "నేనెందుకు ఏదో మర్చిపోలేకుండా వున్నాను ? తగిలిన ప్రతి దెబ్బకూ మచ్చ పడక మానదు. మచ్చతో పాటు నొప్పి కూడా ఎప్పటికీ మిగిలితే ఏమిటిసంగతి ! నాలో ఏదో లోపముంది. అయిపోయిందానికి ప్రతి వాళ్ళు యింతగా కుమిలి పోతారా ? "భూతం" పట్టడమంటారిదే కాబోలు" అనుకుంటుంది ఆమె. నల్గురూ పొగుడుతారు ఆమెను. ప్రొఫెసరు ఆమె గురించి "డాక్టర్ అఖిల ఎంత తెలివైందనుకున్నారు" అని చెప్తాడితరులతో. లాబరేటరీలో ఆమె సలహాలు, సహాయం అడగని వారుండరు. క్లబ్ లో ఆమె స్నేహాన్ని కోరుకోని వారుండరు. అందరి కళ్ళకు ఆమె నెమిలి కన్నే ! ఆమె గాథ. ఆమె భాధ ఎవరికి తెలుసు ? "ఎందుకు తెలియాలి ?" అనుకుంటుందామె. కిల కిలా నవ్వుతుంది. పువ్వులాగ బ్రతుకుతోంది. వెనకటికి ఎవరో అన్నారు. "జీవితం గుఱ్ఱం లాగ పరిగెత్తుతుంది, కళ్ళెం చేతిలో వుండదు. కాలు రికాబులో వుండదు. అయినా ప్రతివాడూ ఆరితేరిన రౌతులాగా కనిపించాలని తాపత్రయ పడుతుంటాడు" అని. అఖిలా అందరిలాంటి మనిషే !

★★★

COMMENTS